సాక్షి
మంచిర్యాల

సోమవారం । 5 । జూన్ । 2023



విజయ చిహ్నం చూపుతున్న సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

న్యూస్‌రీల్

గూడెంలో ఘనంగా పౌర్ణమి జాతర

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం
- 372 సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతంలో భక్తులు

దండేపల్లి: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం జేష్ఠ పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 372 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్నాయి. మంచిర్యాలకు చెందిన ముప్పిడి నారాయణ–శంకరవ్వ దంపతుల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 800 మందికి అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేజీబీవీ ఉద్యోగుల షిఫ్టింగ్ పూర్తి

మంచిర్యాలఅర్బన్: ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కేజీబీవీలో ఉద్యోగుల (బదిలీలు) షిఫ్టింగ్ ప్రక్రియ పూర్తయింది. కేజీబీవీలో విధులు నిర్వహించే ఎస్‌వో, సీఆర్టీ, పీజీసీఆర్టీల ఆన్‌లైన్ వెబ్ అలాట్‌మెంట్ చేశారు. ఈమేరకు స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌ఎస్‌ఏ హైదరాబాద్ నుంచి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆర్డర్‌లు జారీ చేసిన ప్రకారం తాజా కాంట్రాక్టు పద్ధతిన ఈనెల 7న కొత్త పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. జిల్లాలో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలకు 15 మంది ఉద్యోగులను కేటాయించారు. ఇంటర్ డిస్ట్రిక్ బదిలీలు(షిఫ్టింగ్)ద్వారా ఇతర జిల్లాల నుంచి మంచిర్యాలకు 29 మంది రాగా, మంచిర్యాల నుంచి ఇతర జిల్లాలకు 10 మందిని కేటాయించారు. ఇందులో బెల్లంపల్లి కేజీబీవీ నుంచి స్పెషల్ ఆఫీసర్ నిర్మల్ జిల్లా కుబీర్‌కు వెళ్లగా.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి కేజీబీవీ నుంచి బెల్లంపల్లి షిఫ్ట్ అయ్యారని డీఈవో యాదయ్య తెలిపారు.

'ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు'

నెన్నెల: తెలంగాణ ఆకాంక్షలను తుంగలోతొక్కి, ఏం సాధించారని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుర్గా భవాని ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఉత్సవాల పేరుతో కేసీఆర్ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల రుణాలు ఎప్పుడు మాఫీ చేస్తారని ప్రశ్నించారు. ఉచిత ఎరువుల హామీ ఏమైందని అడిగారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు అరిగోస పడుతుంటే పట్టించుకోకుండా ప్రభుత్వం రైతు దినోత్సవం పేరిట సంబరాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరిజిన్ డైరెక్టర్ సేజల్‌ను వేధించి భయభ్రాంతులకు గురిచేసిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

సభకు హాజరైన జనం

అటు వానజల్లు.. ఇటు వరాల జల్లు

- కేసీఆర్ నిర్మల్ సభ సక్సెస్
- తడిసినా.. మురిసిన జిల్లా
- పలు డిమాండ్లు చెప్పిన మంత్రి 'అల్లోల'
- సానుకూలంగా స్పందించిన కేసీఆర్

నిర్మల్: ఓవైపు వాతావరణం చల్లబరుస్తూ వరుణుడి వాన.. మరోవైపు కేసీఆర్ కరుణతో కురిపించిన వరాల వాన.. ఈరెండింటితో ఆదివారం సాయంత్రం నిర్మల్ జిల్లా ఆనందంలో తడిసిముద్దయ్యింది. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి వచ్చి, సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్ అనంతరం బహిరంగసభలో జిల్లాకు వరాలిచ్చారు. జిల్లా వాసుల తరపున రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అడిగినవాటికీ సీఎం సానుకూలంగా స్పందించి, అందరినీ ఆనందింపజేశారు.

అల్లోల అడుగగా..

కలెక్టరేట్ ప్రారంభోత్సవం తర్వాత క్రషర్‌గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో ముందుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి సహకారంతో జిల్లా అన్నిరంగాల్లో దూసుకుపోతోందన్నారు. మరికొన్ని పనులనూ పూర్తిచేసేలా చూడాలని కోరారు.

- స్వర్ణప్రాజెక్టు కాలువ లైనింగ్ పనులు పూర్తిచేయించాలి.
- ఇంజినీరింగ్ కాలేజీని మంజూరుచేయాలి.
- కాళేశ్వరం ప్యాకేజీ పనులు పూర్తిచేయాలి.
- గుండెగాం ముంపు గ్రామసమస్యను తీర్చాలి.
- అర్లి బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలి.
- మూడు నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, వంతెనలు పూర్తిచేయాలి.

ఆయా సమస్యలను చూడాలంటూ మంత్రి కోరగా, వాటన్నింటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 27, 28 ప్యాకేజీ పనులు త్వరలోనే పూర్తిచేసి, లక్ష ఎకరాలకు నీరందిస్తామన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఈ ప్యాకేజీలకు నీరందిస్తామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేస్తామన్నారు. అలాగే తాలుకాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలు ప్రారంభించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

అభివృద్ధి దిశలో..

ఒకప్పుడు మారుమూల జిల్లా, అడవుల జిల్లా అని పేరున్న ఉమ్మడి ఆదిలాబాద్ ఇప్పుడు అభివృద్ధి దిశలో దూసుకుపోతోందని సీఎం కేసీఆర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు జిల్లాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. దీంతో పరిపాలన ప్రజలకు దగ్గరైందన్నారు. ఆసిఫాబాద్ లాంటి అటవీప్రాంతంలో కూడా మెడికల్ కాలేజీ వచ్చిందని పేర్కొన్నారు. అభివృద్ధితోపాటు సంక్షేమంపై దృష్టిపెట్టామన్నారు. పేదల కోసం నిర్మించే 2 వేల డబుల్ బెడ్రూం ఇళ్లకు శంకుస్థాపన చేశామన్నారు. మావనాటే, మావరాజ్ స్ఫూర్తితో గిరిజన తండాలు, గూడేలను పంచాయతీలుగా చేశామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధితో మరింత ముందుకు పోదామని సీఎం పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభం..

నిర్మల్ చేరుకున్న సీఎం కేసీఆర్ నేరుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ మంత్రి కుటుంబసభ్యులు సీఎంకు మంగళహారతులతో స్వాగతం పలికారు. మంత్రి అల్లోల తన కుటుంబసభ్యులను సీఎం పరిచయం చేశారు. అక్కడి నుంచి నేరుగా కొండాపూర్ బైపాస్‌లోని బీఆర్‌ఎస్ భవన్‌కు వెళ్లారు. పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని తన చాంబర్‌లోని చైర్‌లో కూర్చోబెట్టారు. భవన నిర్మాణంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

సభలో ప్రత్యేకంగా..

సీఎం కేసీఆర్ పాల్గొన్న బహిరంగసభలో పలు అంశాలు ఆకట్టుకున్నాయి. ప్రధానంగా పార్టీకి దూరంగా ఉంటున్న పలువురు నేతలు సభకు రావడం, వేదికపైకి ఎక్కడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇటీవల సైలెంట్‌గా, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సత్యనారాయణగౌడ్, సీనియర్ నేతలు చిక్యాల హరీశ్‌రావు, వడ్డి రాజేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. వేదికపై ఉన్న నేతలందరూ వారిని పలకరించారు.

మననీళ్లు వాడుకుంటున్నారని..

సరిహద్దునే ఉండే మహారాష్ట్ర గ్రామాల ప్రజలు జిల్లాలో భూములు కొనుగోలు చేస్తున్నారని, ఇక్కడ బోర్లు వేసుకుని నీళ్లను మహారాష్ట్రలో పారించుకుంటున్నారని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చెప్పారని.. సీఎం కేసీఆర్ సభలో పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, దేశమంతా మనను మోడల్‌గా తీసుకుంటున్నారనే క్రమంలో సీఎం ఈ విషయాన్ని గుర్తుచేశారు. బహిరంగ సభలో తెలంగాణ ధూంధాం కళాకారులు ప్రత్యేకంగా నిలిచారు. సీఎం కేసీఆర్ రాక ముందు వరుణుడు ముంచుకువచ్చాడు. దాదాపు అరగంటపాటు వర్షం కురిసింది. అయినా సభికులు వెళ్లిపోకుండా ఉండేలా 'వానమ్మా.. కాసేపు ఆగిరావమ్మా..' అంటూ ఆకట్టుకునే పాటలు పాడుతూ అందరినీ అక్కడే ఉండేలా చేశారు.



సభా వేదికపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామన్న, విఠల్‌రెడ్డి, చిన్నయ్య



నూతన కలెక్టరేట్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్

ఉమ్మడి జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ

- మరో శుభవార్త చెప్పిన కేసీఆర్
- 'సాక్షి' కథనం.. మంత్రి కోరిక మేరకు ప్రకటన

నిర్మల్: నిర్మల్ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లాకు మరో శుభవార్త చెప్పారు. 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనంతోపాటు, జిల్లా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విన్నపం మేరకు ఉమ్మడి జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో 'ఇంజినీరింగ్.. ఇవ్వండి సారూ.. శీర్షికన 'సాక్షి'లో ఆదివారం కథనం ఇచ్చాం. అలాగే బహిరంగసభలో మాట్లాడుతూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ జిల్లాకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేయాలని సీఎంను కోరారు. ఈమేరకు సానుకూలంగా స్పందించిన సీఎం ఉమ్మడి జిల్లాకు ఒక జేఎన్‌టీ యూ ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అది ఎక్కడ ఉంటుందని మంత్రి నిర్ణయిస్తారని చెప్పారు. దీంతో జిల్లాలోనే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'ఇంజినీరింగ్' ఇవ్వండి సారూ..





'సమీకృతం' ప్రారంభించి..

జిల్లాకు గుండెకాయలాంటి సమీకృత కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ అట్టహాసంగా ప్రారంభించారు. కలెక్టర్‌ను చాంబర్‌లో కూర్చోబెట్టారు. అనంతరం సీఎం కేసీఆర్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పవర్ పర్ క్యాపిటల్‌లో నంబర్‌వన్‌లో ఉన్నామన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్రా(కే) జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు తీసుకుని మనకు గౌరవం తెచ్చిపెట్టిందని గుర్తుచేశారు. దళిత, గిరిజనులు, వెనుకబడి తరగతుల్లో నిరుపేదలు ఉన్నారని, వారికోసం చేయాల్సింది చాలా ఉందని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల తర్వాత ఫుడ్‌ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. పోడు భూముల పంపిణీని బ్రహ్మాండంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. దేశమంతా మన పథకాలను చూసి తెలంగాణ మోడల్ కావాలని కోరుతున్నారని, అందుకు మీరే కారణం అని సీఎం కేసీఆర్ ఉద్యోగులను అభినందించారు. మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు. అంతకుముందు కొత్త కలెక్టరేట్‌లోకి సీఎం, మంత్రులకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలోనే మైనార్టీ రెసిడెన్షియల్, మెడికల్ కాలేజీ భవనం, బంజారభవన్, పలురోడ్లు, డబుల్‌బెడ్రూం ఇళ్లకు సంబంధించిన పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ షురూ..!



ప్రభుత్వ బుక్ డిపో నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్న డీఈవో యాదయ్య

జిల్లాకు కావాల్సిన పుస్తకాలు	4,32,243
జిల్లాకు చేరిన పుస్తకాలు	2,81,160
ఇంకా రావాల్సిన పుస్తకాలు	48,400
రెండో విడత అవసరమైన పుస్తకాలు	85,716

- బుక్‌డిపోల నుంచి ఎమ్మార్సీలకు తరలింపు
- పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు అందించేలా చర్యలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల పునఃప్రారంభం రోజున విద్యార్థుల చేతికి పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ కసరత్తు మొదలు పెట్టింది. ఓవైపు బడిబాట కార్యక్రమం సాగుతుండగా.. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పుస్తకాలు పాఠశాలలకు చేరేలా చర్యలు తీసుకుంటోంది. జిల్లా బుక్‌డిపో నుంచి ఎమ్మార్సీలకు సరఫరా చేసి అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తోంది. ఉచితంగా విద్యార్థులకు అందించే మొదటి దఫాలో(పార్ట్–1) పాఠ్యపుస్తకాల పంపిణీ చేయనుండగా, సెప్టెంబర్‌లో రెండో విడత (పార్ట్–2) పుస్తకాలు అందించనున్నారు. 2023–24 విద్యాసంవత్సరం ప్రారంభానికి ఏడు రోజులే ఉన్నందున ఆలోగా పాఠ్యపుస్తకాలు అందించే ఏర్పాట్లు చేస్తోంది. ఆదివారం ప్రభుత్వ బుక్ డిపో నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీని డీఈవో యాదయ్య ప్రారంభించారు. ఈనెల 5న హాజీపూర్, నస్పూర్, 6న మందమర్రి మండలాల ఎమ్మార్సీలకు పంపిణీ చేయనున్నారు.

జిల్లాకు అవసరమైన పుస్తకాలు..

జిల్లాలో 805 పాఠశాలలు ఉండగా, 61,409 మంది విద్యనభ్యసిస్తున్నారు. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు 4,32,243 పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 2,81,160 పాఠ్య పుస్తకాలు బుక్‌డిపోకు చేరాయి. గత విద్యా సంవత్సరం మిగిలిపోయిన 16,973 పుస్తకాలు పోను 4,15,270 జిల్లాకు పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. సెప్టెంబర్‌లో పార్ట్ –2 పుస్తకాలు 85,710 రానున్నాయి. పార్ట్–1 పుస్తకాలు ఇంకా 48,400 జిల్లాకు చేరాల్సి ఉంది.

మిగిలిన పుస్తకాల మాటేమిటో..

జూన్ 12 పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వచ్చిన పుస్తకాల్లో 4, 7, 8, 9వ తరగతికి చెందినవి మాత్రమే పూర్తిస్థాయిలో ఉన్నాయి. మిగిలిన తరగతులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు సరఫరా కాలేదని తెలుస్తోంది. పుస్తకాల పంపిణీలో అవకతవకలు జరుగకుండా, పక్కదారి పట్టడకుండా ఈసారి బార్‌కోడ్ ముద్రించారు. ఇందులో ఒకటో తరగతిలో తెలుగు రీడర్, ఇంగ్లిష్ రీడర్, రెండో తరగతిలో ఇంగ్లిష్ రీడర్, గణిత వర్క్‌బుక్, మూడో తరగతిలో గణితం(తెలుగు మీడియం), ఐదో తరగతిలో తెలుగు రీడర్, ఆరో తరగతిలో తెలుగు రీడర్, ఇంగ్లిష్ రీడర్, పదో తరగతికి చెందిన హిందీ రీడర్ పుస్తకాలు రావాల్సి ఉంది.

12 వరకు అన్ని పాఠశాలలకు..

ఈనెల 12వ తేదీ వరకు అన్ని మండలాలకు చెందిన పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీలకు పంపిణీ చేస్తామని డీఈవో యాదయ్య తెలిపారు. బుక్‌డిపో నుంచి మంచిర్యాల మండలానికి సంబంధించిన పాఠ్యపుస్తకాల పంపిణీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రాల నుంచి పాఠ్యపుస్తకాలను వెంటనే పాఠశాలలకు సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి చౌదరి, మండల విద్యాధికా రి పోచయ్య, బుక్‌డిపో మేనేజర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.


ప్రజల రక్షకులు పోలీసులే



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, కలెక్టర్ సంతోష్



ర్యాలీలో డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్



సర్కిల్‌లో నుంచి జంప్ చేస్తున్న జాగిలం

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- జిల్లాలో ఘనంగా సురక్ష దినోత్సవం
- ఆకట్టుకున్న ర్యాలీ.. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, ఓపెన్ హౌస్

మంచిర్యాలక్రైం: ప్రజలు ప్రశాంతంగా ఉన్నారంటే అది పోలీసుల ఘనతేనని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సురక్ష దినోత్సవం నిర్వహించారు. పోలీసుల ర్యాలీని సీసీసీ పోలీస్ స్టేషన్ వద్ద ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ సీసీసీ కార్నర్ మీదుగా మంచిర్యాల ఐబీ, బెల్లంపెల్లి చౌరాస్తా రైల్వేస్టేషన్ రోడ్, మార్కెట్ రోడ్ మీదుగా వెళ్లి ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం వరకు పెట్రోకార్స్, షీ టీమ్స్, ప్రత్యేక పోలీస్ టీమ్, బ్లూకోల్ట్స్ టీమ్స్ ద్విచక్రవాహనాలతో ర్యాలీ తీశారు. ర్యాలీ అనంతరం ప్రభుత్వ బాలు పాఠశాల మైదానంలో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. పోలీసులు విధినిర్వాహణలో ఉపయోగించే గన్స్, బుల్లెట్స్, ఇతర ఆయుధాలపై అవగాహన కల్పించారు. నేరస్తులను పట్టుకునే విధానం, డాగ్‌స్క్వాడ్ విన్యాసాలు, పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీసుల ర్యాలీ, డాగ్ స్క్వాడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోలీస్ శాఖలో వివిధ విభాగాలకు చెందిన ట్రాఫిక్, షీటీం, ఐబీ, ఇంటలిజెన్స్ అధికారుల విధులపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు కుల, మత, రాజకీయాలకు అతీతంగా వర్గంభేదం లేకుండా నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తారని అన్నారు. అందరికీ పండుగలు ఉంటాయి.. ప్రతీ ఉద్యోగికి పండుగల వేళ సెలవులు ఉంటాయి కానీ పోలీసులకు సెలవులు ఉండవన్నారు. 24 గంటలు విధులు నిర్వహించే ఉద్యోగులు పోలీసులే అని పేర్కొన్నారు. అనంతరం డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ ప్రజల భద్రత మాదే.. బాధ్యత మాదే అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశీష్ సింగ్, జిల్లా ఫైర్ అధికారి అజయ్‌కుమార్, ఏసీపీలు తిరుపతిరెడ్డి, నరేందర్, సదయ్య, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాల ఏర్పాటుకు ముందుకు రావాలి

భీమారం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను పొందేందుకు సహకార సంఘాల ఏర్పాటుకు యాదవ మహిళలు ముందుకు రావాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ సూచించారు. మండల కేంద్రంలోని యాదవ సంఘం భవన సముదాయంలో మహిళలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పురుషుల మాదిరిగానే మహిళలు సహకార సంఘాలుగా ఏర్పడాలన్నారు. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యంగా రుణాలు వ్యక్తి గతంగా కాకుండా సంఘాల ద్వారా ఎక్కువ మొత్తం తీసుకుని ఉపాధినిచ్చే పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బోయిన మల్లేశ్, మహిళా సహకార సంఘం అధ్యక్షురాలు అట్ల కళ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



పంచనామా చేస్తున్న పోలీసులు

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన కొముురం మధునక్క (34) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన కొముురం అర్జయ్యకు నలుగురు కూతుర్లు సంతానం. పెద్ద కుమార్తె మధునక్క ఫిట్స్‌తో బాధపడుతుండడంతో వివాహం జరిపించలేదు. మిగతా ముగ్గురు కుమార్తెలకు వివాహమైంది. దీంతో మానసికంగా బాధపడుతుండేది. శనివారం రాత్రి పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల, కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అర్జయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బోరు, పైపులు దగ్ధం



కాలిన స్టార్టర్, పైపులైను

భీమారం(చెన్నూర్): మండలంలోని ఎలకేశ్వరం గ్రామానికి చెందిన పోటు నరేందర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఆదివారం ప్రమాదవశాత్తు బోరు బావితో పాటు పైపులు దగ్ధమయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం పక్క పొలానికి చెందిన రైతు కిష్టంపేట బాపురెడ్డి త న పొలంలో ఉన్న వరిగడ్డికి నిప్పు పెట్టడంతో కాలుతూ తమ పొలంలోకి మంటలు వ్యాపించాయి. దీంతో బోరుబావితో పాటు పైపులు దగ్ధమయ్యాయని బాధిత రైతు వాపోయాడు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం



శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన అంగరి శ్రీనివాస్ (35)టాటాఏస్ వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంట్లోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య శిరీష, కుమారుడు అనూష్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వరాష్ట్రంలో స్వర్ణకాంతులు

ఉమ్మడి రాష్ట్రంలో పేరెన్నికగన్న సంస్థగా ఖ్యాతిగడించిన సింగరేణి చివరికి స్వరాష్ట్రంలో తెలంగాణ ఆస్తిగా మారింది. 134 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి నాణేనికి ఒక పార్శ్వం అయితే తెలంగాణ వచ్చాక సాధించిన ప్రగతి మరో పార్శ్వంగా చెప్పవచ్చు. తొమ్మిదేళ్లలో సింగరేణి సాధించిన ప్రగతి సువర్ణాక్షరాలతో లిఖించదగింది. ప్రత్యేక రాష్ట్రం తరువాత సింగరేణి దశ దిశగా మారింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి సంస్థ ఈ తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని స్మరిస్తూ సింగరేణి వ్యాప్తంగా సోమవారం సంబరాలు జరుపుకుంటున్నారు.

- తెలంగాణ ఆస్తి సింగరేణి
- తొమ్మిదేళ్లలో అద్భుత ప్రగతి
- 176 శాతం వృద్ధి నమోదు
- నేడు సింగరేణి సంబరాలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆరుకొత్త జిల్లాల పరిధిలో సింగరేణి విస్తరించి ఉంది. 24 భూగర్భ గనులు, 18 ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులు నడుస్తున్నాయి. 42,733 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. రోజుకు 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. థర్మల్ కేంద్రాలు, సిమెంట్, స్పాంజ్‌ఐరన్‌తో పాటు ఫార్మా తదితర 2 వేల పరిశ్రమలకు బొగ్గును అందిస్తుంది. 16 రాష్ట్రాల్లోని పరిశ్రమలకు సింగరేణి బొగ్గు రవాణా జరుగుతోంది. 2013–14లో సింగరేణి సాలీన బొగ్గు ఉత్పత్తి 50.47 మిలియన్ టన్నులు సాధించింది. ప్రస్తుతం 2022–23లో 67.14 మిలియన్ టన్నులు, 2023–24లో 75 మిలియన్ టన్నులు సాధించింది. గడిచిన తొమ్మిదేళ్లలో బొగ్గు ఉత్పత్తిలో పెద్ద ఎత్తున వృద్ధి సాధించడంతో పాటు అదే సమయంలో కొత్త ఉద్యోగాల కల్పనలో కూడా ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ వస్తే మన ఉద్యోగాలు, మన వనరులు మనకు దక్కుతాయన్న కల నెరవేరింది.

2014 నుంచి 2023 ఏప్రిల్ వరకు ఉద్యోగాలు
కారుణ్య ఉద్యోగాలు 15,256
ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసిన ఉద్యోగాలు 4,207
ఇంటర్నల్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసిన ఉద్యోగాలు 3,490

లాభాల బోనస్

- 2014లో కంపెనీ లాభాల నుంచి 21 శాతం కార్మికులకు వాటాకింద రూ. 102.99 కోట్లు పంపిణీ
- 2022లో 30 శాతం వాటా కింద రూ.368.11 కోట్లు
- హరితహారంలో కంపెనీ వ్యాప్తంగా 5 కోట్ల 71 లక్షల మొక్కలు నాటారు.

కొలువుల గని..

కొలువుల. గనిగా సింగరేణి పేరు సాధించింది. 2013కు ముందు సింగరేణిలో కొత్త ఉద్యోగాలు పూర్తిగా మందగించాయి. డిపెండెంట్ ఉద్యోగాలు రద్దు అయ్యాయి. మెడికల్ అన్‌ఫిట్‌ద్వారా కేవలం కొద్ది మంది మాత్రమే డిపెండెంట్ ఉద్యోగం పొందేవారు. కాని తరువాత సింగరేణిలో ఉద్యోగాల భర్తి స్వరూపమే మారిపోయింది. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో ఆయన ఆదేశాల మేరకు కారుణ్య ఉద్యోగాలు ఇస్తున్నారు. దీంతో వేలాది మంది యువతి, యువకులు వారి తండ్రులు, మామల స్థానంలో సింగరేణిలో ఉద్యోగంలో చేరారు. వీరితో పాటు ఇంటర్నల్, ఎక్స్‌ట్రనల్ ఖాళీలను కూడా భర్తి చేశారు.



భూగర్భంలో కార్మికుల విజయకేతనం(ఫైల్)

తొమ్మిదేళ్లలో సింగరేణి సాధించిన ప్రగతి		
అంశం(వృద్ధి రేటు)	2013–14	2022–23
బొగ్గు ఉత్పత్తి (33 శాతం)	50.47 (మిలియన్ టన్నులు)	67.14 (మిలియన్ టన్నులు)
బొగ్గు రవాణా (39 శాతం)	47.94 (మిలియన్ టన్నులు)	66.69 (మిలియన్ టన్నులు)
అమ్మకాలు (176 శాతం)	రూ.11,928 కోట్లు	రూ. 32,978 కోట్లు
లాభాలు (421 శాతం)	రూ.419 కోట్లు	రూ.2,184 కోట్లు

రాష్ట్రం వెలుపల తవ్వకాలు

సింగరేణి తెలంగాణలోనే కాకుండా మొదటిసారిగా రాష్ట్రం దాటి ఒరిస్సాలో కూడా బొగ్గు తవ్వకాలను ఆరంభించింది. నైనీలో సింగరేణి చేపట్టిన ఈ బొగ్గు బ్లాక్‌లో ఈ సంవత్సరం నుంచి బొగ్గు తవ్వకాలు ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరం 60 లక్షల టన్నులు ఆతర్వాత కాలక్రమేణా 100 లక్షల టన్నుల బొగ్గు తీయాలని కంపెనీ సంకల్పించింది. ఇది పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధిస్తే 2025 నాటికి కంపెనీ వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి రికార్డు నెలకొల్పే అవకాశం ఉంది. ఈ నైనీ బ్లాక్‌కు సంబంధించిన స్టేజ్–1, స్టేజ్–2 అనుమతులన్నీ వచ్చాయి. సుమారు 1200 మంది పర్మినెంట్ ఉద్యోగులు, మరో 1200 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇందులో పనిచేయనున్నారు. సింగరేణి వివిధ పన్నులు, రాయల్టీల రూపేణా 2014 నుంచి 2023 వరకు కేంద్ర ప్రభుత్వానికి రూ.26,208 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.23,446 కోట్లు చెల్లించింది.

వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన డైరెక్టర్

మందమర్రిరూరల్(చెన్నూర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏరియా అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం మందమర్రి ఏరియాను సందర్శించిన సింగరేణి డైరెక్టర్ బలరాం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట జీఎం మోహన్‌రెడ్డి, ఎస్‌ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు, యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఇన్నోవా కారు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మేదరివాడ సమీపంలో శనివారం రాత్రి కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్నాళ్లుగా పాతమంచిర్యాల రాళ్లవాగు నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. శనివారం రాత్రి కూడా ఇన్నోవా కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో దాని పరిధిలో ఉన్న 10 ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేయడంతో మధ్యాహ్నం తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మహారత్న కంపెనీలకు దీటుగా సింగరేణి

శ్రీరాంపూర్(మంచిర్యాల): మహారత్న కంపెనీలకు దీటుగా సింగరేణి కంపెనీ నేడు అభివృద్ధి సాధిస్తుందని సింగరేణి డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) ఎన్.బలరాం అన్నారు. ఆదివారం ప్రగతి మైదానంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గడిచిన తొమ్మిదేళ్లలో సంస్థ సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ సోమవారం సింగరేణి వ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ రూ.33 వేల కోట్ల టర్నోవర్ సాధించి రూ.2,184 కోట్ల లాభాలు గడించిందన్నారు. గతంలో రాష్ట్రంలో పవర్ హాలిడేలు కొనసాగేవని కానీ తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి విద్యుత్ సంస్థలతో పాటు రాష్ట్రంలోని ఇతర విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి 15 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. జైపూర్ ఎస్టీపీపీలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డైరెక్టర్ బలరాం

మైదానంలో ఏర్పాట్ల పరిశీలన

సోమవారం ప్రగతి మైదానంలో జరిగే సింగరేణి సంబరాల ఏర్పాట్లను ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఎస్టీపీపీ జీఎం సూర్యనారాయణరాజుతో కలిసి మైదానంలో చేసిన ఏర్పాట్లను డైరెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం గోపాల్ సింగ్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, శివరావు, చిరంజీవి, ఏజెంట్ ఏవీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుజ్జగించ నాన్న లేడు.. లాలించగ అమ్మ రాదు

- క్యాన్సర్‌తో గతేడాది తల్లి మృతి
- అనారోగ్యంతో ఆదివారం తండ్రి..
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- ముత్తంపేట్‌లో ఘటన

కౌటాల(సిర్పూర్): గతేడాది క్యాన్సర్‌తో తల్లి మృతి చెందగా ఆదివారం అనారోగ్యంతో తండ్రి మృతి చెందాడు. దీంతో ఆ ముగ్గురు చిన్నారులు అ నాథలుగా మిగిలారు. మండలంలోని ముత్తంపేటకు చెందిన లేండుగురే బాపురావ్–సత్యబాయి దంపతులకు గోపాల్(12), మమత (10), విఘ్నేశ్వర్ (8) సంతానం. బాపురావ్ (38) హ మాలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతేడాది క్యాన్సర్‌తో సత్యబాయి మృతి చెందింది. దీంతో అన్నీ తానై పిల్లలను పెంచుతూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నా డు. తల్లి లేని లోటు పిల్లలకు తెలియకుండా కష్టపడి పని చేస్తు కుటుంబాన్ని నేట్టుకొస్తున్నాడు. హైబీపీతో బాధపడుతున్న బాపురావ్‌కు నాలుగు రోజుల క్రితం సొమ్మసిల్లి పడిపోయాడు. కుడికా లు కూడా పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు ముందుగా సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మెదడులో నరాలు చిట్లి రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో నాన్న ఎప్పుడూ మాతోనే ఉంటాడు అనుకుంటున్న ఆ పిల్లల నమ్మకాన్ని విధి వమ్ము చేసింది. నాన్న లే..అంటూ ముగ్గురు చిన్నారులు తండ్రి మృతదేహంపై పడి రోదించిన తీరు అందర్నీ కలిచివేసింది. బాధిత కుటుంబాన్ని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావ్, ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్, సర్పంచ్ ఆదే శ్రీనివాస్ పరామర్శించారు. అనాథలైన చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న చిన్నారులు

విప్లవమయం సుదర్శన్ జీవితం

- అజ్ఞాతంలోనే ఐదు దశాబ్దాలు
- దౌర్జన్యాలను ఎదురించి ప్రజలకు చేరువై..

బెల్లంపల్లి: నల్ల బంగారు నేల బెల్లంపల్లిలో వికసించిన ఎర్ర మందారం సుదర్శన్. నూనూగు మీసాల 22ఏళ్ల నవ యవ్వనంలో విప్లవ సిద్ధాంతాలకు ఆకర్శితుడై సుమారు ఐదు దశాబ్దాలు అజ్ఞాతం వాసం గడిపి 70ఏళ్ల వయస్సులో తుది శ్వాస విడిచాడు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడైన ఆయన జీవితాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసి ఏనాడూ ఇంటిముఖం చూడలేదు. నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కోసం, పీడిత జన విముక్తి కోసం పోరాడుతూనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో మే 31న తీవ్ర అనారోగ్య సమస్యలతో కన్నుమూశాడు. పీడిత తాడిత ప్రజలు ఆప్యాయంగా దూలా దాదా అని పిలుచుకునేవారు.

ఆరుగురు సంతానంలో అందరికన్నా పెద్ద

సింగరేణి కార్మికుడు కటకం మల్లయ్య, వెంకటమ్మ దంపతులకు ఆరు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు సుదర్శన్. ఆయనకు ఐదుగురు తోబుట్టువులు రఘు, కమలాకర్, సతీష్‌కుమార్, పద్మ, విజయ ఉన్నారు. తండ్రి మల్లయ్య రిటైర్మెంటు అయ్యాక 2017లో, తల్లి వెంకటమ్మ 2018లో మృతిచెందారు. తల్లిదండ్రులు మరణించినా ఇంటి వైపు రాకుండా సుదర్శన్ విప్లవ పంథాను అనుసరించాడు. సుదర్శన్‌ను ప్రభుత్వానికి లొంగిపొమ్మని పోలీసులు కోరిన ప్రతీసారి తండ్రి మల్లయ్య ససేమిరా అనేవాడు. నిక్కచ్చిగా వ్యతిరేకించేవాడు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో సుదర్శన్‌పై రూ.కోటికిపైగా రివార్డు ఉంది.

డిగ్రీ చదివి.. డిప్లొమా చేసి

ప్రాథమికోన్నత విద్యను బెల్లంపల్లిలో పూర్తి చేసిన సుదర్శన్ డిగ్రీ బీఎస్సీని మంచిర్యాలలో అభ్యసించాడు. ఆ తర్వాత మైనింగ్ డిప్లొమా చేయడానికి హైదరాబాద్ వెళ్లాడు. 1967లో జరిగిన నక్సల్‌బరి, శ్రీకాకుళ పోరాటాల ప్రభావంతో క్రమంగా రాడికల్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు ప్రభావితం అయ్యాడు. యూనియన్‌లో క్రియాశీలకంగా పని చేశాడు. 1974–75 కాలం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. విద్యార్థి దశలో అన్యాయాలు, దౌర్జన్యాలను సహించేవాడు కాదు. బెల్లంపల్లిలో గూండాల ఆగడాలను అరికట్టడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఆర్ఎస్‌యూలో పని చేస్తూనే కార్మిక వర్గ పోరాటాలకు ఆజ్యం పోశాడు. పెద్ది శంకర్, గజ్జల గంగారాం, నల్లా ఆదిరెడ్డి, బందెల రాములు, పులి మధునయ్యలతో కలిసి సింగరేణి కార్మికవర్గ సమస్యలు, ఆదివాసీ, గిరిజనులపై అటవీ అధికారులు, పోలీసులు, దొరలు, భూస్వాములు సాగిస్తున్న దాష్టీకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో క్రియాశీలంగా పని చేశాడు.



సుదర్శన్ చిత్రపటానికి విప్లవ జోహార్లు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు

గూండాల హత్య అనంతరం అజ్ఞాతంలోకి..

ఆ రోజుల్లో బెల్లంపల్లిలో ఏ బస్తీలో చూసినా గూండాల ఆధిపత్యం కొనసాగేది. కార్మికులపై దాడులు, కల్లు దుకాణాల్లో దౌర్జన్యాలు, కార్మికులను బెదిరించి కల్లు సీసాలు కొనుగోలు చేయించి గూండాలు తాగేవారు. గూండాలకు కుందేళ్ల శంకర్, దస్తగిరి నాయకత్వం వహించి ప్రజల్లో తీవ్ర భయాందోళన కలిగించేవారు. ఇళ్లలో చొరబడి మహిళలను చెరిచేవారు. ఆర్ఎస్‌యూలో పని చేస్తున్న సుదర్శన్, బందెల రాములు, మధునయ్య తదితర విప్లవ శ్రేణులు 1978 మార్చి 27న పట్టపగలు కన్నాల బస్తీలో వారిని పట్టపగలు హత్య చేసి ప్రజలకు చేరువయ్యారు. అదే ఏడాది బెల్లంపల్లిలో పని చేస్తున్న సింగరేణి పర్సనల్ అధికారి శ్యామ్‌మోహన్‌రావు కొడుకు రఘు ఇంటి పనిమనిషిపై అత్యాచారం చేసి చంపేశాడు. అతడిని కఠినంగా శిక్షించాలని నిర్వహించిన ఆందోళనలో సుదర్శన్ పాల్గొన్నాడు. ఈ ఆందోళన లాఠీచార్జికి దారితీసింది. ఈ రెండు ఘటనల అనంతరం సుదర్శన్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. అంతకుముందు రామకృష్ణాపూర్ ఏరియా ఆర్‌కే–1లో కార్మికుడిగా కొంత కాలం పని చేశాడు.

రైతు పోరాటాలకు నాయకత్వం

ఆర్ఎస్‌యూ నుంచి పీపుల్స్‌వార్‌లో చేరిన తర్వాత సుదర్శన్ జన్నారం, నిర్మల్, లక్సెట్టిపేట ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగించాడు. జిల్లా కమిటీ సభ్యుడి హోదాలో పని చేశాడు. ఆ ప్రాంత రైతుల్లో చైతన్యం రగిల్చి భూపోరాటాలు చేశాడు. పీపుల్స్‌వార్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా 1981 ఏప్రిల్ 19న ఇంద్రవెల్లిలో జరిగిన సభకు నాయకత్వం వహించాడు. 1985లో మహారాష్ట్రలోని గడ్చిరోలి, సిరోంచ ప్రాంతాలకు వెళ్లాడు. ఫారెస్టు లైజన్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1995లో స్పెషల్ కమిటీ కార్యదర్శిగా నియామకం అయ్యాడు. 2001లో కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా పదోన్నతి పొందాడు.

ఉద్యమంలో అసువులు బాసిన భార్యాభర్తలు

పీపుల్స్‌వార్‌లో చేరిన సుదర్శన్, లలితక్క భార్యాభర్తలుగా ఉద్యమంలో పని చేశారు. విప్లవ మార్గాన్ని ఎంచుకున్న లలితక్కను పెళ్లి చేసుకున్న సుదర్శన్ దండకారణ్యంలో క్రియాశీలకంగా పనిచేస్తు న్న సమయంలో 2003 మే 13న బెజ్జూర్ మండలం అగర్‌గూడ అటవీ ప్రాంతంలో జరిగిన పో లీసు ఎదురుకాల్పుల్లో లలితక్క మృతిచెందింది.



సుదర్శన్, లలితక్క(ఫైల్)

సుదర్శన్‌కు కన్నీటి జోహార్లు

బెల్లంపల్లి: మావోయిస్టుపార్టీ ఉద్యమంలో పనిచేసి కన్నుమూసిన కేంద్రకమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్‌కు బెల్లంపల్లిలో కుటుంబ సభ్యులు, రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల శ్రేణులు ఆదివారం నీటి జోహార్లు అర్పించారు. బెల్లంపల్లి కన్నాల బస్తీలోని సుదర్శన్ సోదరుడు కటకం సతీశ్‌కుమార్ ఇంటికి సుదర్శన్ చిన్ననాటి మిత్రులు, మాజీ నక్సలైట్లు, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. సుదర్శన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమర్‌రహే కామ్రేడ్ సుదర్శన్ అని నినదించారు. సురద్శన్ పోరాట పటిమ, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు కె.సురేఖ, విశ్వప్రసాద్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, రొడ్డ శారద, నాతరి స్వామి, బండి ప్రభాకర్, కేవీ ప్రతాప్, శ్రీధర్, జగన్, సీపీఐ నాయకులు చిప్పనర్సయ్య, చంద్రశేఖర్, ఐలయ్య, రాజం, బీజేపీ నాయకుడు ఏమాజీ, సీఐడీ రిటైర్డు అడిషనల్ ఎస్పీ పులియాల రవికుమార్, శ్రీమన్నారాయణ, ఆడెపు సమ్మయ్య, ఎం.సత్యనారాయణ, ఎన్.శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం



కలెక్టర్ దంపతులకు జ్ఞాపిక ఇస్తున్న బాసర ఆలయ ఈవో



వేదికపై కళాకారుల ఆటాపాట

సీఎం సభ సక్సెస్..

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం సీఎం సభ సక్సెస్ అయ్యింది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. సభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ముఖ్యమంత్రి కురిపించిన వరాలవానకు సభికుల నుంచి ఫుల్‌జోష్‌తో స్పందన వచ్చింది. సభ ప్రారంభానికి ముందే ఈదురుగాలులు రావడంతో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నేతల ఫ్లెక్సీలు, కటౌట్లు కిందపడి చినిగిపోయాయి. సీఎం కేసీఆర్ సభకు వచ్చే లోపు వర్షం కురవడంతో ప్రజలు అక్కడి నుంచి పరుగులు తీశారు. కొందరు వృద్ధులు పడిపోయిన కటౌట్‌ల కింద తలదాచుకున్నారు. మరికొందరు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలను తలపై పెట్టుకుని వర్షానికి తడవకుండా అక్కడే కూర్చుని నానాఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



సీఎం కేసీఆర్‌కు నిర్మల్ పెయింటింగ్ అందజేస్తున్న మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యేలు



వేదికపై పురాణం సతీష్, లోక భూమారెడ్డి, గోడం నగేశ్, రాథోడ్ బాపురావు, రేఖానాయక్



వర్షం కురుస్తుండడంతో నెత్తిపై కుర్చీలు అడ్డుగా పెట్టుకున్న ప్రజలు